

చదువుల వనమాలి.. అందుకో నివాళి

మహానేత వైఎస్సార్ ఫీజురీయింబర్స్‌మెంట్‌తో విద్యార్థుల జీవితాల్లో వెలుగు నింపారు. - 8లో..



ట్రాక్టర్ ట్రాలీ కిందపడి బాలుడు దుర్మరణం

సైకిల్‌పై వెళ్తూ ప్రమాదవశాత్తు ట్రాలీ కిందపడి బాలుడు మృతిచెందాడు. - 8లో..

గరిష్టం/కనిష్టం
34 /28

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. ఉక్కపోతగా ఉంటుంది. అక్కడక్కడా వర్షం పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

డీఈవో బదిలీ

- అదనపు బాధ్యతలు స్వీకరించిన గుంటూరు ఆర్‌జేడీ వీఎస్ సుబ్బారావు



అదనపు బాధ్యతలు స్వీకరిస్తున్న వీఎస్ సుబ్బారావు

ఒంగోలు: ప్రకాశం జిల్లా విద్యాశాఖ అధికారి పి.రమేష్‌ను బదిలీ చేశారు. పట్టుమని ఆరు నెలలు కూడా కాకమునుపే బదిలీ చేయడం విద్యాశాఖ వర్గాల్లో చర్చనీయాంశమైంది. పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో జాయింట్ డైరెక్టర్‌గా పదోన్నతి పొంది, జిల్లా విద్యాశాఖ అధికారిగా బాధ్యతలు నిర్వహిస్తున్న బి.విజయభాస్కర్‌ను ఆకస్మికంగా బదిలీ చేసి ఆయన స్థానంలో పి.రమేష్‌కు బాధ్యతలు అప్పగించారు. దీంతో రమేష్ ఈ ఏడాది ఫిబ్రవరి 12న బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల జరిగిన ఉపాధ్యాయుల బదిలీల్లో సాంకేతికపరమైన సమస్యలు వచ్చాయి. తాజాగా ఉపాధ్యాయుల పదోన్నతుల్లో సీనియార్టీ నిర్ణయించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించారంటూ రగడ జరగడం, చివరకు పదోన్నతుల ప్రక్రియ కూడా నిలిచిపోయిన నేపథ్యంలో రమేష్‌ను బదిలీ చేశారనే ప్రచారం జరుగుతోంది. గుంటూరు ఆర్‌జేడీకి ఇన్‌చార్జ్ డీఈవోగా బాధ్యతలు అప్పగించారు.

స్టెప్ సీఈవోగా ఎంవీ లోకేశ్వరరావు



ఎంవీ లోకేశ్వరరావు

ఒంగోలు: స్టెప్ సీఈవోగా ఎంవీ లోకేశ్వరరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. జిల్లా ఫారెస్ట్ సెటిల్‌మెంట్ ఆఫీసర్‌గా పూర్తి అదనపు బాధ్యతలతో ఆయనను కలెక్టర్ నియమించారు. దీంతో ఆయన శుక్రవారం కార్యాలయానికి చేరుకుని స్టెప్ సీఈవోగా బాధ్యతలు నిర్వహిస్తున్న డి.బాబూరావు వద్దనుంచి బాధ్యతలు స్వీకరించారు. ఈయన ప్రస్తుతం ఫారెస్ట్ సెటిల్‌మెంట్ ఆఫీసర్‌గా పనిచేస్తున్నారు.

స్కానింగ్ కేంద్రాలకు రిజిస్ట్రేషన్ తప్పనిసరి



స్కానింగ్ కేంద్రాలపై సమావేశం నిర్వహిస్తున్న ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌ఓ సురేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: స్కానింగ్ కేంద్రాలు, ఏఆర్‌టీ కేంద్రాలకు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ ఉండాలని ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ సురేష్‌కుమార్ సంబంధిత అధికారులకు సూచించారు. శుక్రవారం డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో స్కానింగ్ సెంటర్‌లపై సమావేశం నిర్వహించారు. దీనిలో మాట్లాడుతూ రిజిస్ట్రేషన్ లేని స్కానింగ్, ఏఆర్‌టీ సెంటర్‌లను చట్ట విరుద్ధంగా పరిగణించాలన్నారు. వీటిపై సరోగసి చట్టం, పీసీపీఎన్‌డీటీ చట్టాల ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఏఆర్‌టీ సెంటర్‌లు సంతాన సాఫల్య కేంద్రాల నిర్వహణకు అనుమతుల కోసం వైద్యులు, సిబ్బంది, ల్యాబ్ పరికరాల వివరాలు నేషనల్ ఏఆర్‌టీ పోర్టల్‌లో అప్‌లోడ్ చేసి దరఖాస్తు చేసుకునేలా చూడాలన్నారు. నిర్దేశించిన రుసుము చెల్లించి దరఖాస్తులను డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో అందజేయాలన్నారు. అనంతరం తనిఖీలు చేస్తారన్నారు. అందుకోసం గైనకాలజిస్ట్, రేడియాలజిస్ట్, పెథాలజిస్ట్, సోషల్ వర్కర్, మానిటరింగ్ కన్సల్‌టెంట్, ఎన్‌జీవోలతో బృందం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కమిటీకి చైర్మన్‌గా కలెక్టర్ ఉంటారని ఆయన అనుమతి పొందిన తర్వాత రాష్ట్ర కార్యాలయానికి పంపి రిజిస్ట్రేషన్ నంబర్ కేటాయిస్తారన్నారు. రిజిస్ట్రేషన్ అయిన తర్వాత కేంద్రాల్లో ఆ సర్టిఫికెట్‌ను ప్రజలకు కనపడేలా ఉంచాలన్నారు. దీనిలో సిబ్బంది అధికారులు పాల్గొన్నారు.

కనిగిరిలో కలెక్టర్ స్పందన

ఒంగోలు అర్బన్: ప్రతి సోమవారం కలెక్టర్ నిర్వహించే స్పందన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ఈ నెల 10వ తేదీ సోమవారం కనిగిరిలో నిర్వహిస్తున్నట్లు కలెక్టరేట్ వర్గాలు ఒక ప్రకటనలో తెలిపాయి. కనిగిరి ఆర్టీసీ బస్టాండ్ ఎదురు ఉన్న పవిత్ర కళ్యాణ మండపంలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు స్పందన నిర్వహిస్తారని పేర్కొన్నారు. అనంతరం మధ్యాహ్నం 3 గంటలకు కనిగిరి అసెంబ్లీ నియోజకవర్గ సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమాలకు జిల్లా యంత్రాంగం హాజరవుతుందని, ప్రజలు సద్వినియోగం చేసుకుని సమస్యలను పరిష్కరించుకోవాలని కోరారు.

పెద్దాయన ప్రకాశం

ప్రతి ప్రగతిలో.. ప్రతి సంక్షేమంలో..
ప్రతి పథకంలో పెద్దాయన ప్రకాశం వికాసమైంది.
ప్రతి గుండెలో గుడి కట్టించుకున్నారు.
పుష్కర కాలం దాటినా ఆయన తమ కుటుంబాలకు చేసిన మేలును గుర్తు చేసుకుంటూ జ్ఞాపకాలను పదిలం చేసుకున్నారు. ఆయన పలకరింపే ఒక తీపి జ్ఞాపకం.. ఆయన ఆప్యాయత రక్త సంబంధం కన్నా మిన్న.. కరువు నేలపై జలసిరుల కోసం తపించారు..
ఆయన మనసే బంగారం..
అంటూ ఇప్పటికీ ఆయన జ్ఞాపకాలను ఆతరం నేతలు పంచుకుంటూనే ఉంటారు. ఆ అనుబంధం మరపురానిదనే అంటుంటారు. వైఎస్సార్ తదనంతరం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డితో కలిసి అడుగులో అడుగులు వేస్తున్న వారెందరో జిల్లాలో ఉన్నారు. కరువు నేలపై పంటపొలాలు పచ్చగా ఉండాలని.. పశ్చిమ ప్రకాశంలో కృష్ణమ్మ పరుగులు తీసేందుకు పునాదులు వేశారు. ఆయన తనయుడు సీఎం వైఎస్ జగన్ ఆ ఫలాలను నేడు పండించబోతున్నారు. శనివారం వైఎస్సార్ జయంతిని పురస్కరించుకొని ఆయన జ్ఞాపకాలను..ఆయనతో అనుబంధం ఉన్న వారి మనో భావాలను పంచుకుందాం.



రామతీర్థం రిజర్వాయర్ వద్ద ప్రజలకు అభివాదం చేస్తున్న వైఎస్సార్ (ఫైల్)

- జిల్లాతో విడదీయరాని బంధం
- పుష్కరం దాటినా జిల్లా వాసుల గుండెల్లో పదిలం
- జలయజ్ఞంతో భూములు సస్యశ్యామలం
- గుండ్లకమ్మను పూర్తి చేసిన అపర భగీరథుడు
- వెలిగొండ ప్రాజెక్టు పనులకు రూ.వేల కోట్లు ఖర్చు
- రూ.250 కోట్లతో జిల్లాకు మెడికల్ కాలేజీ (రిమ్స్)
- తండ్రి ఆశయాలను కొనసాగిస్తూ ముందుకెళుతున్న సీఎం జగన్

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: రాష్ట్రానికే కాదు దేశానికే వెన్నెముక అన్నదాత అని భావించారు దివంగత ముఖ్యమంత్రి, మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి. వ్యవసాయం దండగకాదు పండుగ చేస్తానని చెప్పి అక్షరాలా నిజం చేసి చూపించారు. జిల్లాలోని బీడు భూములను సైతం సస్యశ్యామలంగా చేశారు. సాగు, తాగునీటి ప్రాజెక్టులే లక్ష్యంగా నిధుల వరద కురిపించారు. జిల్లాలో ఆయన ఆలోచనలతో జీవం పోసుకున్న ప్రాజెక్టులు ఇలా ఉన్నాయి.

■ పశ్చిమ ప్రకాశంలో దోర్నాల మండలంలో నిర్మించతలపెట్టిన వెలిగొండ ప్రాజెక్టు పూర్తి చేయటానికి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన 2004 నుంచే పూనుకున్నారు. పార్టీలకతీతంగా కమ్యూనిస్ట్ పార్టీ నాయకుడు పూల సుబ్బయ్య పేరు పెట్టి పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టుగా నామకరణం చేశారు. నిధుల వరద కురిపించారు. పనులు వేగవంతం చేశారు. ఆయన అకాల మరణం తర్వాత ప్రాజెక్టు పనులు మందగించారు. చంద్రబాబు ఐదేళ్ల పాలనలో వెలిగొండను నిర్లక్ష్యం చేశారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయ్యాక పనులు వేగం పుంజుకున్నాయి. వెలిగొండను పూర్తి చేసి మహానేత ఆశయాలను నెరవేర్చనున్నారు.

■ గుండ్లకమ్మ నది నుంచి నీరు వృథాగా సముద్రం పాలు కావటాన్ని గమనించిన వైఎస్సార్ మద్దిపాడు మండలం మల్లవరం వద్ద ప్రాజెక్టు నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. అందుకోసం రూ.543.43 కోట్లు కేటాయించారు. 3.859 టీఎంసీల సామర్థ్యంతో ఈ ప్రాజెక్టు నిర్మాణానికి రూపకల్పన చేశారు. 9 మండలాల పరిధిలో 84 వేల ఎకరాలకు సాగు నీరు, జిల్లా కేంద్రం ఒంగోలుతో పాటు 43 గ్రామాల పరిధిలోని 2.56 లక్షల మంది ప్రజలకు తాగునీరు అందించేలా ప్రాజెక్టును రూపకల్పన చేశారు. 2008 నవంబర్ 24న దీనిని జాతికి అంకితం చేశారు. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ మోహన్ రెడ్డి బాధ్యతలు చేపట్టిన తరువాత క్యాడ్ వాం పనుల కింద ప్రాజెక్టు ఆధునికీకరణ, చివరి భూముల వరకు సాగు నీరు అందించేందుకు రూ.100 కోట్లు మంజూరు చేయించి పనులు వేగంగా సాగుతున్నాయి.



గుండ్లకమ్మ ప్రాజెక్టు ప్రారంభోత్సవం అనంతరం ప్రాజెక్టు వద్ద వైఎస్ రాజశేఖరరెడ్డి (ఫైల్)

■ జిల్లాలో ఒక్క మెడికల్ కాలేజీ కూడా లేకపోవటాన్ని గుర్తించిన వైఎస్సార్ జిల్లా కేంద్రం ఒంగోలులో రిమ్స్ మెడికల్ కళాశాలను మంజూరు చేశారు. మెడికల్ కాలేజి నిర్మాణానికి అప్పట్లోనే రూ.250 కోట్లు మంజూరు చేశారు. వైఎస్ జగన్ సీఎం అయిన తరువాత జీజీహెచ్ అభివృద్ధికి రూ.270 కోట్లు వెచ్చించారు. జిల్లా కేంద్రం ఒంగోలు నగరంలో గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ (జీజీహెచ్) అభివృద్ధి కోసం మంత్రి బాలినేని శ్రీనివాస రెడ్డి అవిరళ కృషి చేశారు. అందుకోసం ప్రభుత్వం నుంచి రూ.170 కోట్లు మంజూరు చేయించారు. అందుకోసం జీజీహెచ్ వెనుక 7 ఎకరాలను అదనంగా కేటాయించారు. బెడ్లు పెంచటంతో పాటు అదనపు సౌకర్యాలు, నర్సింగ్ కాలేజీ ఏర్పాటు చేస్తున్నారు. దాదాపు రూ.100 కోట్లు వెచ్చించి సీటీఎంఆర్‌తో పాటు జీజీహెచ్‌లో అనేక ఆధునికీకరణ పనులు చేపట్టారు. మార్కాపురంలో మెడికల్ కాలేజీ పనులు వేగవంతమయ్యాయి.

రాజకీయ భిక్ష పెట్టారు..



వైఎస్ రాజశేఖరరెడ్డి రాజకీయ భిక్ష పెట్టారు. ఎమ్మెల్యేని చేశారు. మంత్రి పదవి ఇచ్చారు. జిల్లాకు సంబంధించి ఏ సమస్యను ఆయన దృష్టికి తీసుకువెళ్లినా వెంటనే పరిష్కరించే వారు. ఒంగోలుకు రిమ్స్, మెడికల్ కళాశాలను ఇచ్చారు. జిల్లాలో ప్రతిష్టాత్మకమైన వెలిగొండ ప్రాజెక్టుకు రూ.వేల కోట్లు కేటాయించారు. గుండ్లకమ్మను పూర్తి చేశారు. రాజకీయంగా నా ఎదుగుదలకు ఆ కుటుంబం ఎంతో చేసింది. ఆయన అంటే ఎనలేని అభిమానం.

– బాలినేని శ్రీనివాసరెడ్డి, మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే

వైఎస్సార్ ఆత్మబంధువు



దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి మాకు బంధువు మాత్రమే కాదు..జిల్లా ప్రజలందరికీ ఆత్మబంధువు. జిల్లాకు సంబంధించిన ఏ సమస్యనైనా ఆయన దృష్టికి తీసుకెళ్తే వెంటనే స్పందించి దాన్ని పరిష్కరించేవారు. పేద ప్రజల కోసం నిరంతరం తపించే మహానాయకుడిని కోల్పోవడం మా కుటుంబానికే కాదు ఈ రాష్ట్రానికే తీరని లోటు. ఆయన జ్ఞాపకాలు ఎప్పటికీ స్మరించుకుంటూనే ఉంటాం.

– వైవీ సుబ్బారెడ్డి, టీటీడీ చైర్మన్

సొంత చెల్లెలు మాదిరిగా చూశారు



మహానేత వైఎస్ రాజశేఖర రెడ్డి అన్న నన్ను సొంత చెల్లెలి మాదిరిగా ఆదరించారు. ఆయన స్వయంగా నా చెల్లెలులాంటి దానివి అని ఎన్నో సందర్భాల్లో అన్నారు. రాజశేఖరన్న పాదయాత్ర చేస్తుంటే అనారోగ్యంగా ఉందని తెలిసినప్పుడల్లా ఎక్కడుంటే అక్కడకు వెళ్లి పరామర్శించే దానిని. అన్న కూడా తన సొంత తోబుట్టువుగా ఎంతో ఆప్యాయంగా మాట్లాడేవారు. రాజశేఖరన్నకు బాగలేదు అని తెలిస్తే నాకు గుండెల్లో బండ పడ్డంత బాధ కలిగేది. మా కుటుంబాన్ని కాంగ్రెస్ పార్టీలోకి తీసుకొని ఎంతో ఆదరించారు. బీవీఎస్‌ఆర్ ఇంజినీరింగ్ కాలేజీ ప్రారంభోత్సవం 2009 ఫిబ్రవరి 25న జరిగింది. కాలేజీని ప్రారంభించటానికి రావాలన్నా...అని కోరగానే 2009 ఎన్నికల సమయంలో ఎంత బిజీగా ఉన్నా వచ్చి కాలేజీని ప్రారంభించారు. మా కుటుంబాన్ని ఎంతో అభిమానంగా చూసుకున్నారు. శివ ప్రసాద్ హుషారుగా ఉన్నాడు అని 2009లో దర్శి కాంగ్రెస్ పార్టీ టికెట్ ఇచ్చి గెలిపించారు కూడా.

– బూచేపల్లి వెంకాయమ్మ, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్

వైఎస్సార్‌తో అనుబంధం మరిచిపోలేం

వైఎస్ రాజశేఖర్‌రెడ్డితో సుమారు 30 ఏళ్ల అనుబంధం ఉంది. అప్పట్లో సీఎల్‌పీ నేతగా, పీసీసీ అధ్యక్షునిగా, ముఖ్యమంత్రిగా ఉన్న ఆయన్ను అసెంబ్లీతోపాటు చాలా సార్లు కలిశాను. కొండన్నా.. అంటూ ఆప్యాయంగా పలకరించే వారు. 2004లో ముఖ్యమంత్రి అయిన వెంటనే రాజీవ్ పల్లెబాటలో భాగంగా మార్కాపురానికి వచ్చారు. పెద్దారవీడు మండలం సుంకేసుల వద్ద వెలిగొండ ప్రాజెక్టు పనులను ప్రారంభించారు. అప్పట్లోనే మార్కాపురం పట్టణానికి శాశ్వతంగా మంచి నీటిని అందించే దూపాడు పథకానికి కూడా శంకుస్థాపన చేశారు. ఎప్పుడు వెళ్లినా ఆత్మీయంగా పలకరిస్తారు. అటువంటి వ్యక్తిని మళ్లీ చూడలేదు. ఒక్కోసారి అపాయింట్‌మెంట్ లేకుండానే ఇంటికి వెళితే ఏమాత్రం విసుక్కోకుండా నవ్వుతూ మాట్లాడిన ఆ మహా మనిషిని ఎన్నటికీ మరిచిపోలేను. మార్కాపురం నియోజకవర్గ అభివృద్ధిలో వైఎస్సార్ స్థానం మర్చిపోలేనిది. ఆయన ఆశయ సాధనకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారు. వెలిగొండ ప్రాజెక్టు టన్నెల్-1, టన్నెల్-2 లో కూడా వైఎస్సార్‌తో కలిసి పాల్గొన్నాను.

– కేపీ కొండారెడ్డి, మాజీ ఎమ్మెల్యే, మార్కాపురం



వెలిగొండ ప్రాజెక్టు శంకుస్థాపనలో వైఎస్సార్‌తో మాజీ ఎమ్మెల్యే కేపీ కొండారెడ్డి (ఫైల్)

సహృదయుడు, మహానేత..



2004 నుంచి 2009 వరకూ దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యేగా ప్రజలకు సేవలందించడం జీవితంలో మర్చిపోలేను. అప్పుడు కంభం ఎమ్మెల్యేగా ఉన్నాను. వెలిగొండ ప్రాజెక్టు పనులతోపాటు రాజీవ్ పల్లెబాటలో మార్కాపురానికి వచ్చారు. రాయవరం అప్పట్లో కంభం నియోజకవర్గ పరిధిలో ఉండేది. రైల్వే గేటు ఉండటం వలన ప్రజలు పడుతున్న ఇబ్బందిని వైఎస్సార్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన వెంటనే స్పందించి అప్పట్లోనే రూ.8 కోట్లు రైల్వే ఓవర్ బ్రిడ్జికి మంజూరు చేశారు. దీంతోపాటు కలుజువ్వలపాడు నుంచి తర్లుపాడుకు, గార్లదిన్నె నుంచి వెలుగొండ స్వామి గుడికి రోడ్డు మంజూరు చేశారు. కంభంలో డిగ్రీ కళాశాలను మంజూరు చేశారు. కొనకనమిట్లలో ఎంపీడీవో కార్యాలయం మంజూరు చేశారు. ఇలా అభివృద్ధి ప్రదాతగా ఆయన నిలిచిపోయారు.

– ఉడుముల శ్రీనివాసులరెడ్డి, కంభం మాజీ ఎమ్మెల్యే

ఆరోగ్య శ్రీ ప్రదాత..



శాసనసభతో పాటు ఆయన నివాసంలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డిని చాలాసార్లు కలిశాను. మార్కాపురం నియోజకవర్గ అభివృద్ధిలో ఆయన చేసిన కృషిని ఎప్పటికీ మరిచిపోలేము. ఆరోగ్య శ్రీ ప్రదాతగా పేద ప్రజల హృదయాల్లో నిలిచిపోయారు. నియోజకవర్గంలో వందలాది మంది వైద్య చికిత్స కోసం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వద్దకు వెళ్లగా ఆయన వెంటనే నిధులిచ్చేవారు. చెరగని చిరునవ్వు, ఆత్మీయతకు మారుపేరుగా వైఎస్సార్ మా గుండెల్లో నిలిచిపోయారు. రాజీవ్ పల్లెబాటలో ఆయనతో కలిసి ప్రయాణించాను.

– జంకె వెంకటరెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే, మార్కాపురం.

పరిపాలనాదక్షుడు..



మంచి పరిపాలనా దక్షుడు వైఎస్ రాజశేఖర్‌రెడ్డి. ఆయనకు, నాకు ఎంబీబీఎస్ చదువుకునే రోజుల్లోనే పరిచయం ఉంది. అదే పరిచయం నేను డాక్టర్ వృత్తి మానేసి యువ నాయకునిగా కాంగ్రెస్‌లో పనిచేసిన సమయంలో కొనసాగింది. ఆ తరువాత మేమిద్దరం వేరు వేరు పార్టీల్లో పనిచేశాం. 2004లో రాజశేఖర్ రెడ్డిని కలిశాను. 2009లో అద్దంకిలో కాంగ్రెస్‌ను గెలిపించండి డాక్టర్ గారూ అని నాతో అన్నారు. అప్పుడు అద్దంకి అభ్యర్థికి సపోర్టు చేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాను. దురదృష్టం తరువాత ఆయన ప్రజల కోసం రచ్చబండకు వెళుతూ కానరాని లోకాలకు వెళ్లారు. చాలా బాధపడ్డాను. అయితే ఆయన తనయుడు వైఎస్సార్‌సీపీ పెట్టిన తరుణంలో ఆ పార్టీలో చేరి నియోజకవర్గ ఇన్‌చార్జిగా పనిచేశాను. విలువలు కలిగిన నాయకుడు రాజశేఖర్‌రెడ్డి.

– డాక్టర్ బీసీహెచ్ గరటయ్య, మాజీ ఎమ్మెల్యే, అద్దంకి

లేఅవుట్‌లలో సమస్యలపై పర్యవేక్షించాలి

- కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్
- పందిళ్లపల్లె లేఅవుట్‌లో లబ్ధిదారులతో ఎమ్మెల్యే అన్నా, కలెక్టర్ మాటామంతి
- మోక్షగుండంలో సచివాలయం, ఆర్‌బీకే, బీఎంసీల ప్రారంభోత్సవం



జగనన్న సురక్షలో సర్టిఫికెట్లు పంపిణీ చేస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్, ఎమ్మెల్యే అన్నా రాంబాబు

బేస్తవారిపేట: జగనన్న లేఅవుట్‌లలో తహసీల్దార్, ఎంపీడీఓ, సచివాలయ ఉద్యోగులు పర్యవేక్షిస్తుండాలని, ఏవైనా సమస్యలుంటే వెంటనే గూగుల్ ఫామ్‌లో నమోదు చేయాలని కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ అన్నారు. మండలంలోని పందిళ్లపల్లెలో జగనన్న లేఅవుట్‌ను పరిశీలన, లబ్ధిదారులతో సమావేశం నిర్వహించారు. రోడ్డు తర్వాత డ్రైనేజీ కాలువకు స్థలం వదిలేసి నిర్మాణాలు చేసుకునేలా చూడాలన్నారు. పందిళ్లపల్లె లేఅవుట్‌లో దాదాపు వెయ్యి ప్లాట్లు ఉండటంతో పెద్ద టౌన్‌షిప్ అవుతుందని, ఇంటి నిర్మాణాలు ఆలస్యం చేసుకోవడంతో ఖర్చు పెరుగుతుందన్నారు. లేఅవుట్‌లలో అన్ని వసతులు కల్పిస్తున్నామని, గృహ నిర్మాణాలను ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని తెలిపారు. పట్టా తీసుకుని, గృహాలు మంజూరైనా 240 మంది ఎందుకు పనులు మొదలు పెట్టలేదన్నారు. అధికారులు, వీఓఏలు బేస్తవారిపేట నుంచి లేఅవుట్‌కు దూరం 10 కిలోమీటర్లు ఉండటం, 50 మందికి సొంత గృహాలు, 30 మంది వృద్ధులు కావడంతో లబ్ధిదారులు ముందుకు రావడంలేదన్నారు. సొంత గృహాలు ఉన్నవారిని అనర్హులుగా గుర్తించి తొలగించాలని తహసీల్దార్ డీవీబీ వరకుమార్‌కు కలెక్టర్ సూచించారు. గృహ నిర్మాణాలు చేపట్టని వారికి నోటీసులు ఇచ్చి ఎందుకు పట్టించుకోకుండా వదిలేశారన్నారు. లేఅవుట్‌ను పంచాయతీలకు అప్పగించకపోవడంతో కొన్ని సమస్యలను పరిష్కరించలేకపోతున్నామని సచివాలయ ఉద్యోగులు తెలపడంతో వెంటనే చర్యలు తీసుకోవాలని రెవెన్యూ అధికారులకు సూచనలు ఇచ్చారు. గృహాలు నిర్మించుకునేందుకు సిద్ధంగా ఉన్నామని సిమెంట్ ఇవ్వడంలేదని నలుగురు లబ్ధిదారులు కలెక్టర్‌కు తెలపడంతో హౌసింగ్ ఏఈ పోలయ్యపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సమస్యను ఎలా పరిష్కరించాలో నేర్చుకోకుండా ఎంతకాలం ఉంటారన్నారు.

సమస్యలపై పూర్తి అవగాహన ఏర్పరచుకోవాలి:

సచివాలయ ఉద్యోగులు సమస్యలపై పూర్తి అవగాహన పెంచుకోవాలని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ అన్నారు. మోక్షగుండంలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో పాల్గొన్నారు. గ్రామంలోనే సమస్యల పరిష్కారం కోసం సీఎం సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేశారన్నారు. వలంటీర్లు గ్రామస్తుల సమస్యలను సచివాలయంలో నమోదు చేయించాలని సూచించారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రతి సమస్యను నమోదు చేసుకుని ఎమ్మెల్యే అన్నా రాంబాబు పరిష్కరిస్తారన్నారు. సచివాలయ ఉద్యోగులు గ్రామంలో పర్యటించి ప్రతి కుటుంబంపై అవగాహన కల్పించుకోవాలని సూచించారు. ఎమ్మెల్యే అన్నా రాంబాబు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దేశంలోని ఏ రాష్ట్రంలో లేని అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారని, పథకాలు ప్రతి గడపకు అందాలనే ఉద్దేశంతో వలంటీర్ వ్యవస్థను తీసుకొచ్చారన్నారు. మండల స్థాయి అధికారులు సమస్యల పరిష్కారంపై పూర్తి అవగాహన కల్పించుకోవాలన్నారు. సచివాలయ స్థాయిలో పరిష్కరించలేని సమస్యలను జగనన్నకు చెబుదాంలో నమోదు చేయించాలన్నారు. రానున్న ఎన్నికల్లో సీఎంకు అండగా నిలవాలని కోరారు. వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని సీఎం నెరవేర్చారన్నారు. మహిళలకు, రైతులకు రాష్ట్ర ప్రభుత్వం పెద్ద పీట వేసిందన్నారు.

సచివాలయం, ఆర్‌బీకే, బీఎంసీలు ప్రారంభం

మోక్షగుండంలో రూ.80 లక్షలతో నిర్మించిన సచివాలయం, ఆర్‌బీకే, బీఎంసీలను ఎమ్మెల్యే అన్నా రాంబాబు, కలెక్టర్ దినేష్‌కుమార్, సబ్ కలెక్టర్ సేతుమాధవన్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి ప్రారంభించారు. ముందుగా పందిళ్లపల్లె జగనన్న లేఅవుట్‌లో ఇద్దరి గృహాలను ప్రారంభించారు.

కార్యక్రమంలో ఎంపీపీ వేగినాటి ఓసూరారెడ్డి, జెడ్పీటీసీ బీవీ రాజయ్య, హౌసింగ్ పీడీ పేరయ్య, ఈఈ వెంకటస్వామి, తహసీల్దార్ డీవీబీ వరకుమార్, సర్పంచ్ ఆవుల అరుణకుమారి, ఎంపీటీసీ ఆవుల రంగమ్మ, బేస్తవారిపేట సొసైటీ బ్యాంక్ అధ్యక్షుడు బారెడ్డి వెంకటేశ్వరరెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

నేడు పంటల బీమా పరిహారం జమ

- రైతు బ్యాంకు ఖాతాలకు జమచేయనున్న సీఎం వైఎస్.జగన్
- 73,351 మంది రైతులకు రూ.181.02 కోట్లు జమచేయనున్న వైనం
- ఎక్కువ మొత్తంలో బీమా సొమ్ము రానున్న రాష్ట్రంలోనే 4వ జిల్లాగా ప్రకాశం
- జిల్లాలోని 4 ఇంటిగ్రేటెడ్ అగ్రి ల్యాబ్స్‌ను కూడా ప్రారంభించనున్న వైనం
- మహానేత వైఎస్సార్ జయంతిని పురస్కరించుకొని రైతు దినోత్సవంగా నిర్వహణ

ఒంగోలు సబర్బన్: రైతు దేశానికి వెన్నెముక... రైతన్నను బాగా చూసుకోవాలన్న ఉద్దేశంతోనే మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి జలయజ్ఞం ప్రారంభించి ప్రాజెక్టులు నిర్మించారు. దీంతో రైతుకు కొండంత ధైర్యాన్నిచ్చినట్లయింది. వైఎస్సార్ ఆశయాలను ఆయన తనయుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కొనసాగిస్తూ రైతుకు వెన్నుదన్నుగా నిలిచారు. రైతు భరోసాతో మరింత భరోసా కల్పించి రైతు భరోసా కేంద్రాలు, ఏ సీజన్‌కు ఆ సీజన్ ఇన్‌పుట్ సబ్సిడీ, పంటల బీమా పరిహారం ఇవ్వటంలాంటి ఎన్నో కార్యక్రమాలకు రూపకల్పన చేసి రైతన్నను ఆదుకుంటున్నాడు. రైతు బాంధవుడిగా ఉన్న మహానేత జయంతి జూలై 8వ తేదీని రైతు దినోత్సవంగా ప్రకటించి రైతు లోగిళ్లలో పండుగ వాతావరణాన్ని కల్పిస్తున్నారు సీఎం వైఎస్ జగన్.

రూ.181 కోట్ల ఖరీఫ్–2022 పరిహారం జమ:

డాక్టర్ వైఎస్సార్ ఉచిత పంటల బీమా–ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన కింద జిల్లాలోని రైతులకు పరిహారం అందించనున్నారు. వైఎస్‌ఆర్ జయంతిని పురస్కరించుకొని నిర్వహిస్తున్న రైతు దినోత్సవం నాడే ఖరీఫ్–2022 సీజన్‌లో వేసిన పంటలకు సంబంధించి బీమా పరిహారాన్ని నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 73,351 మంది రైతులకు రూ.181.02 కోట్లు అందజేయనున్నారు. దిగుబడులు తగ్గిన పంటలు మిర్చి, పత్తి, వరి, సజ్జ, కందికి పరిహారాన్ని అందించనున్నారు.

నాలుగు అగ్రి ల్యాబ్‌లు నేడు ప్రారంభం:

రైతు దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లాలో పూర్తయిన నాలుగు ఇంటిగ్రేటెడ్ అగ్రి ల్యాబ్‌లను ప్రారంభించనున్నారు. అనంతపురం జిల్లా కళ్యాణదుర్గంలో సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి రైతు దినోత్సవంలో పాల్గొంటున్నారు. అక్కడ నుంచే ఖరీఫ్–2022 పంటల బీమా పరిహారాన్ని రైతు బ్యాంకు ఖాతాలకు బటన్ నొక్కి జమచేయన్నారు. అదేవిధంగా అక్కడ నుంచే వర్చువల్ పద్ధతిలో జిల్లాలోని నాలుగు అగ్రి ల్యాబ్‌లను కూడా ప్రారంభిస్తారు. సంతనూతలపాడులో రూ.100.06 లక్షలతో నిర్మించిన అగ్రి, పశు సంవర్ధక ల్యాబ్‌ను, యర్రగొండపాలెంలో రూ.102.67 లక్షలతో నిర్మించిన కేవలం అగ్రి ల్యాబ్‌ను, దర్శిలో రూ.88.49 లక్షలతో నిర్మించిన అగ్రి, పశు సంవర్ధక ల్యాబ్‌ను, గిద్దలూరులో రూ.108.09 లక్షలతో నిర్మించిన అగ్రి ల్యాబ్‌ను ప్రారంభిస్తారు.

నియోజకవర్గం	రైతులు	పరిహారం (రూ.కోట్లలో)
దర్శి	12,125	20.38
గిద్దలూరు	13,306	11.65
కనిగిరి	11,236	54.13
కొండపి	8,915	00.44
మార్కాపురం	14,458	41.95
ఒంగోలు	0009	00.004
సంతనూతలపాడు	1677	01.73
యర్రగొండపాలెం	11,146	07.53

ట్రాక్టర్ ట్రాలీ కింద పడి బాలుడు దుర్మరణం



సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్సై ప్రేమ్‌కుమార్

- తోటి స్నేహితుడితో కలిసి సైకిల్ తొక్కుతూ జారి పడి మృతి

తాళ్లూరు (ముండ్లమూరు): తోటి స్నేహితుడితో కలసి హుషారుగా సైకిల్‌పై వెళ్తూ ప్రమాదవశాత్తు ట్రాక్టర్ ట్రాలీ కింద పడి బాలుడు మృతి చెందిన సంఘటన శుక్రవారం సాయంత్రం ప్రకాశం జిల్లా తాళ్లూరు మండలం తూర్పు గంగవరంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే...తూర్పుగంగవరంలో పరమార్ రోహిత్ సింగ్ (11) అనే బాలుడు తోటి స్నేహితుడితో కలిసి పాఠశాల వదిలిన తర్వాత సైకిల్‌పై ప్రధాన వీధిలో వెళ్తున్నాడు. అంతకు ముందుగా కంకర లోడ్‌తో ట్రాక్టర్ వెళ్తోంది. ఆ ట్రాక్టర్‌ను క్రాస్‌చేస్తూ ఒకరికి పక్కన ఒకరు వెళ్తూ ఒక్కసారిగా రోహిత్ కింద పడి పోయాడు. అదే సమయంలో ట్రాక్టర్ ట్రాలీ టైర్ ఎక్కటంతో తల నుజ్జు నుజ్జయి అక్కడికక్కడే మృతిచెందాడు. సంఘటన స్థలాన్ని ఎస్సై ప్రేమ్‌కుమార్, ఏఎస్సై మోహన్‌రావు పరిశీలించారు.



తీవ్ర విషాదంలో కుటుంబం..

రాజస్థాన్‌కు చెందిన పరమార్ లక్ష్మణ్, అనిత దంపతులు మూడు దశాబ్దాల క్రితం తాళ్లూరు మండలానికి వచ్చి స్థిర పడ్డారు. తూర్పుగంగవరంలో లక్ష్మణ్ సెల్ షాపు నిర్వహిస్తున్నాడు. వారికి కోమల్, రోహిత్ ఇరువురు సంతానం కాగా మృతుడు రెండో కుమారుడు. హుషారుగా తిరుగుతూ ఒక్కసారిగా ప్రమాదంలో మృతి చెందటంతో స్థానికులు విషాదంలో మునిగిపోయారు. తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు.


పోలీసుల సమస్యలు పరిష్కరిస్తాం

- ఎస్పీ మలికాగర్గ్

ఒంగోలు టౌన్: విధి నిర్వహణలో పోలీసులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యల పరిష్కారమే ప్రధాన లక్ష్యంగా ప్రతి శుక్రవారం పోలీసు గ్రీవెన్స్ నిర్వహిస్తున్నట్లు ఎస్పీ మలికాగర్గ్ తెలిపారు. స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం పోలీసు గ్రీవెన్స్ నిర్వహించగా, జిల్లాలోని వివిధ పోలీసు స్టేషన్లలో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది, హోంగార్డులు ఎస్పీని కలిసి వారి సమస్యలు విన్నవించుకున్నారు. వారి నుంచి వినతిపత్రాలు స్వీకరించిన ఎస్పీ.. సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. ఆయా సమస్యలను వెంటనే పరిష్కరించాలని డీపీవో అధికారులను ఆదేశించారు. సిబ్బంది సంక్షేమంలో భాగంగా ప్రతి శుక్రవారం నిర్వహిస్తున్న పోలీసు వెల్ఫేర్ డేలో సిబ్బంది తమ సమస్యలను నిర్భయంగా తెలియజేయాలని ఎస్పీ చెప్పారు. వృత్తిపరమైన, ఆరోగ్యపరమైన సమస్యలను పరిష్కరించడం ద్వారా సిబ్బంది మరింత క్రియాశీలకంగా విధులు నిర్వహించేలా ప్రోత్సహించడమే పోలీసు గ్రీవెన్స్ డే లక్ష్యమన్నారు. కార్యక్రమంలో ఐసీసీఆర్ ఇన్‌స్పెక్టర్ ఓ దుర్గాప్రసాద్, స్పందన ఎస్సై కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



పోలీసుల సమస్యలు ఆలకిస్తున్న ఎస్పీ మలికాగర్గ్



మైనారిటీలకు వరం
4 శాతం బీసీ-ఈ రిజర్వేషన్

- వైఎస్సార్ నిర్ణయంతో చదువులో రాణిస్తున్న ముస్లిం విద్యార్థులు
- మహానేత చేసిన మేలు మరువలేనిదంటూ కృతజ్ఞతలు

చదువుల వనమాలి అందుకో నివాళి

కంభం: వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు తీసుకున్న ఓ నిర్ణయం మైనారిటీలకు వరంగా మారింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ముస్లింలకు 4 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ఆయన తీసుకున్న నిర్ణయంతో ముస్లిం యువతకు విద్య, ఉద్యోగవకాశాలు మెరుగయ్యాయి. గతంలో ఎందరో పేద తల్లిదండ్రులు తమ పిల్లల్లో ప్రతిభ ఉన్నప్పటికీ ఉన్నత చదువులు చదివించుకోలేకపోయేవారు. ఉద్యోగవకాశాలు తక్కువగా ఉండేవి. ఇక ఎంబీబీఎస్ లాంటి ఉన్నత చదువులు వారికి కలగా మిగిలిపోయేవి. వెనుకబడిన ముస్లింల అభ్యున్నతి కోసం ఆనాడు వైఎస్సార్ ప్రవేశ పెట్టిన బీసీ-ఈ రిజర్వేషన్ల పుణ్యమా అని ఎంతో మంది మైనారిటీ విద్యార్థులు ఉన్నత చదువులు చదువుకోవడంతోపాటు మంచి ఉన్నత ఉద్యోగాలు సాధిస్తున్నారు. ఒక్క కంభం పట్టణంలో సుమారు 25 మందికి పైగా విద్యార్థులు ఎంబీబీఎస్ విద్యను అభ్యసిస్తున్నారు.

అక్కాచెల్లెళ్లు ఎంబీబీఎస్‌లు



షేక్ జాస్మిన్



షేక్ జవీరియా

కంభం పట్టణానికి చెందిన ఉపాధ్యాయుడు షేక్ ఖాసింబాషాకు ఇద్దరు కుమార్తెలు. పెద్ద కుమార్తె షేక్ జాస్మిన్ ప్రస్తుతం విశాఖపట్నంలోని ఆంధ్రా మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ ఫైనలియర్ చదువుతోంది. జాస్మిన్‌కు ఆలిండియా స్థాయిలో 24,000 ర్యాంక్, స్టేట్‌లో 1230 ర్యాంక్ వచ్చింది. బీసీ-ఈ కోటాలో ఆంధ్రా మెడికల్ కాలేజీలో ఆమెకు సీటు దక్కింది. చిన్న కూతురు షేక్ జవీరియా నీట్‌లో స్టేట్‌ర్యాంక్ 2400 రాగా బీసీ-ఈ కోటాలో ఎంబీబీఎస్ సీటు పొంది ప్రస్తుతం కాకినాడలోని రంగరాయ మెడికల్ కాలేజ్‌లో ఫైనలియర్ చదువుతోంది. వైద్యులుగా పేద ప్రజలకు సేవ చేస్తామని అక్కాచెల్లెళ్లు చెబుతున్నారు.



పీజీ కోసం సిద్ధమవుతున్నా

పట్టణానికి చెందిన ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మహమ్మద్ ఇబ్రహీం కుమారుడు షేక్ ఫారుక్ విశాఖలోని ఆంధ్రా మెడికల్ కాలేజీలో ఈ ఏడాది ఎంబీబీఎస్ పూర్తి చేశారు. దివంగత ముఖ్యమంత్రి ముస్లింల సంక్షేమాన్ని కాంక్షిస్తూ బీసీ-ఈ కోటా కింద 4 శాతం రిజర్వేషన్ కల్పించడం వల్ల ఎంతో మందికి మేలు చేకూరిందని, తాను మంచి కళాశాలలో ఎంబీబీఎస్ పూర్తి చేయగలగడానికి అదే కారణమని ఫారుక్ తెలిపారు. ప్రస్తుతం పీజీ ప్రవేశ పరీక్ష కోసం శిక్షణ పొందుతున్నారు.

ప్రతిభావంతులకు ప్రయోజనం

కంభం పట్టణానికి చెందిన షేక్ మహబూబ్‌వలి కుమారుడు షేక్ మహబూబ్ షరీఫ్ విజయవాడ నిమ్రా మెడికల్ కళాశాలలో ఈ ఏడాది ఎంబీబీఎస్ పూర్తి చేశారు. డాక్టర్ కావాలన్న తన లాంటి విద్యార్థుల ఆశయానికి వైఎస్సార్ ప్రవేశపెట్టిన 4 శాతం రిజర్వేషన్ అండగా నిలుస్తోందని షరీఫ్ సంతోషంగా చెబుతున్నారు.



ఈ ఏడాది మార్చిలో ఎంబీబీఎస్ పట్టా అందుకుంటున్న షేక్ మహబూబ్ షరీఫ్

రాత మార్చిన ఫీజుల మాఫీ

యర్రగొండపాలెం: వైఎస్సార్ ప్రవేశపెట్టిన ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో లక్షలాది మంది పేద విద్యార్థుల ఉజ్వల భవితకు బాటలు వేసింది. ఆర్థిక పరిస్థితి కారణంగా పేద పిల్లలు చదువుకు దూరం కాకూడదనే ఉద్దేశంతో వైఎస్సార్ అమలు చేసిన 'ఫీజుల మాఫీ' పథకంతో ఎంతో మంది తమ కలలను సాకారం చేసుకున్నారు. వారిలో పెద్దారవీడు మండలంలోని మల్లవరం గ్రామానికి చెందిన బెజవాడ ఏసుబాబు కూడా ఒకరు. ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని వినియోగించుకుని మార్కాపురం జార్జి కళాశాలలో బీటెక్ పూర్తి చేసిన ఏసుబాబు.. ప్రస్తుతం ఇంటెలిజెన్స్ ఎస్సైగా విజయవాడలో విధులు నిర్వర్తిస్తున్నారు.

'ఒకటి నుంచి 5వ తరగతి వరకు మల్లవరం ప్రాథమిక పాఠశాల, 6 నుంచి ఇంటర్ వరకు కొనకనమిట్ల మండలంలోని వెలుగొండ గురుకుల పాఠశాలలో చదువుకున్నా. మా తండ్రి మోషే ఆటో నడుపుతారు. అమ్మ జయమ్మ కూలీ పనులకు వెళ్లేది. ఐదుగురు సంతానంలో ముగ్గురు ఆడపిల్లలు. వాస్తవానికి మా కుటుంబ ఆర్థిక పరిస్థితి నేను బీటెక్ చేసేందుకు సహకరించదు. వైఎస్సార్ ప్రవేశపెట్టిన ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకంతో 2012-16లో బీటెక్ పూర్తి చేశా. జార్జి కాలేజీ యాజమాన్యం కూడా నన్ను ప్రోత్సహించింద'ని తన గతాన్ని చెమర్చిన కళ్లతో వివరించారు.



తల్లిదండ్రులతో ఎస్సై ఏసుబాబు



కేసుల ఎత్తివేతపై ఎస్సీలు హర్షం

నాగులుప్పలపాడు: ఎస్సీలపై పెట్టిన కేసుల ఎత్తివేతపై హర్షం వ్యక్తం చేస్తూ నాగులుప్పలపాడు మండలంలోని ఈదుమూడి గ్రామంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి శుక్రవారం క్షీరాభిషేకం చేశారు. గత టీడీపీ ప్రభుత్వంలో 2017లో కురుక్షేత్రం సభ సందర్భంగా ఎస్సీ మాదిగ కులానికి చెందిన విద్యార్థులు, కార్యకర్తలపై కేసులు పెట్టారు. ప్రస్తుతం ఆ కేసులను రద్దు చేస్తామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారు. దీనిపై ఈదుమూడి గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తూ సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. గత ముఖ్యమంత్రి చంద్రబాబు మాదిగలకు మేలు చేసి పెద్ద మాదిగను అవుతానని చెప్పి.. చివరికి మోసకారిగా మారి అక్రమ కేసులు బనాయించి ఎస్సీల పట్ల తన చులకన భావాజాలాన్ని చాటుకున్నాడని, ప్రస్తుతం అదే కులానికి చెందిన యువకులు కోర్టుల చుట్టూ తిరుగుతూ అక్రమ కేసులతో ఇబ్బందులకు గురవుతున్న నేపథ్యంలో ఆయా కేసులు రద్దు చేయడానికి సీఎం జగన్ నిర్ణయం తీసుకోవడం గొప్ప విషయమని పలువురు హర్షం వ్యక్తం చేశారు. సీఎం జగన్‌కు రుణపడి ఉంటామని అన్నారు. క్షీరాభిషేకం కార్యక్రమంలో ఎంపీటీసీ ముదవర్తి రమ్యక్రాంతి, వైఎస్సార్ సీపీ నాయకులు బొజ్జా దానియేలు, కొదమల ఆదాము, కొమ్మూరి యంగయ్య, కొమ్ము దావీదు, మోహనరావు, పలువురు కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.



సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఈదుమూడి గ్రామస్తులు

ఆత్మహత్యకు యత్నించిన యువతిని రక్షించిన పోలీసులు

ఒంగోలు టౌన్: ఆత్మహత్యకు ప్రయత్నించిన ఓ యువతి ప్రాణాలను ఒంగోలు పోలీసులు రక్షించారు. నగరానికి చెందిన 22 ఏళ్ల యువతి వ్యక్తిగత కారణాలతో ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకుంది. ఈ విషయాన్ని తన బావకు ఫోన్ చేసి చెప్పింది. అతడు వెంటనే పోలీసులకు తెలియజేశాడు. స్పందించిన ఒంగోలు తాలూకా పోలీస్‌స్టేషన్ సీఐ ఆర్.రాంబాబు, ఎస్సై కె.అంకమ్మ, సిబ్బంది ఐటీ కోర్ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి ఆ యువతి ఉన్న ప్రదేశాన్ని గుర్తించారు. వెంటనే అక్కడికి చేరుకున్నారు. అప్పటికే ఆ యువతి చేయి కోసుకుని పడి ఉండగా, అక్కడికక్కడే ప్రథమ చికిత్స చేశారు. అనంతరం ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. కుటుంబ సభ్యులకు సమాచారం అందించడంతో వారు అక్కడికి చేరుకున్నారు. ప్రస్తుతం ఆ యువతి ఆరోగ్య పరిస్థితి బాగానే ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. సకాలంలో స్పందించి తమ బిడ్డ ప్రాణాలు కాపాడిన పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు. పోలీసులను ఎస్పీ మలికాగర్గ్ అభినందించారు.

డాక్టర్‌పై లైంగిక ఆరోపణలు అవాస్తవం

ఒంగోలు అర్బన్/పుల్లలచెరువు: పుల్లలచెరువు పీహెచ్‌సీ వైద్యాధికారి నాగార్జున గౌడ్‌పై ఏఎన్‌ఎం చేసిన ఆరోపణలు అవాస్తవమని సంఘటనపై విచారణ జరిపిన జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ సురేష్‌కుమార్ నివేదికలో తెలిపినట్లు డీఎంహెచ్‌ఓ పేర్కొన్నారు. ఈ మేరకు విచారణ వివరాలను ఒక ప్రకటన ద్వారా తెలియచేసారు. కలెక్టర్ ఆదేశాల మేరకు పుల్లలచెరువు పీహెచ్‌సీ వైద్యాధికారిపై నాయుడుపాలెం సచివాలయంలో ఏఎన్‌ఎంగా పనిచేస్తున్న మహిళ లైంగికంగా వేధింపుల ఆరోపణలు చేయడంతో విచారణ చేపట్టామని తెలిపారు. సచివాలయంలో జరిగిన గొడవలతో కొందరు ఉద్యోగుల సమక్షంలో ఏఎన్‌ఎం యాంటీబయోటిక్ సిరప్‌ను మోతాదుకు మించి తాగిందని, అయితే మీడియాకు మాత్రం పాయిజన్ తీసుకున్నట్లు చెప్పిందని వివరించారు. ఆమె ఆరోగ్యం నిలకడగా ఉన్నందున డిశ్చార్జ్ కావాలని డాక్టర్‌లు తెలిపినా వివిధ కారణాలతో ఆసుపత్రిలో ఉందని తెలిపారు. తదుపరి విచారణ అనంతరం ఎవరి తప్పు ఉందని తేలితే వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. కాగా ఏఎన్‌ఎం దేవికాబాయ్ ఉదంతంపై మార్కాపురం డీఎస్పీ వీరరాఘవరెడ్డి శుక్రవారం విచారణ చేపట్టారు. పీహెచ్‌సీలో పనిచేస్తున్న సిబ్బంది, చాపలమడుగు సబ్‌సెంటర్ పరిధిలోని సిబ్బందిని విచారించి వివరాలు సేకరించారు. ఆయన వెంట ఎస్సై శ్రీహరి ఉన్నారు.